




అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో మన బడి నాడు -నేడు రెండో విడత కింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి జూన్, 12వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్, ఎంపిడిఒలు, ఎంఇఒలను ఆయా శాఖల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టర్ ఎం హరి నారాయణన్ తన ఛాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా విద్యా శాఖాధికారులు, ఎంపిడిఒలు ఎంఇ ఒలు, ఇంజనీరింగ్ అధి కారులతో సమావేశమై నాడు నేడు రెండో విడత పనుల పురోగతిపై మండలాల వారీగా సమీ క్షించారు. కలెక్టర్ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో నాడు నేడు రెండో విడత కింద చేపట్టిన అభివద్ధి పనులను వేగవంతం చేసి ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయాలని సూచించారు. జిల్లా విద్యా శాఖాధికారి గంగా భవాని, సమగ్ర శిక్ష పిఒ ఉషారాణి, ఐటిడిఏ పిఒ ఎం రాణి, పంచాయతీ రాజ్, ఆరడబ్లుఎస్ ఎస్ఇలు అశోక్ కుమార్, రంగవర ప్రసాద్ పాల్గొన్నారు.



కరోనా స్కీమ్‌లో.. భారీ స్కామ్..!


కరోనా స్కీమ్‌లో జరిగిన భారీ స్కామ్ డొంక కదులుతోంది.. ఇదేదో ఒక ఇందుకూరుపేట, అందులోని బిట్ -1 సచివాయం, అక్కడ పనిచేసే ఇద్దరు, ముగ్గురు సిబ్బంది పాత్రగా కనిపించడం లేదు..పెద్ద తలకాయలున్నట్లు అనుమానం కలుగుతోంది. ఇందుకూరుపేట పోలీసులు కేసు విచారణను వేగవంతం చేశారు. ఎలా మొదలు పెట్టాలి, ఎక్కడ నిలపాలనే విషయంపై మల్ల గుల్లాలు పడుతున్నారు. ఇందులో ప్రధాన సూత్రధారిగా చెబుతోన్న మహిళా పోలీసు తనకేమీ తెలీదని, పెద్దలున్నారని చెప్పి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తుంది. ఇప్పటి వరకు ఒక్క సచివాలయం పరిధిలో కేవలం 15 మందిలో రూ.30 కోట్లు స్కామ్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ సచివాలయ పరిధిలోనే 70 మంది వరకు ఉంటారని సమాచారం. గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పరిస్థితి ఎలా ఉంటుందోననే అనుమానం కలుగుతోంది..

- స్వాహాల్లో పెద్దల హస్తం
- హెల్త్, ఇన్సూరెన్స్, ఆస్పత్రులపై అనుమానం
- పోలీసుల విచారణ వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కరోనా ఇన్సూరెన్స్ నగదు స్వాహా విషయంలో జిల్లా మొత్తం ఉత్కంఠ నెలకొంది. వివాదాల నేపథ్యంలో బయటపడిన ఈ స్కామ్‌లో ఎవరి పాత్ర ఎంత అనే విషయంపై విచారణ ప్రారంభమైంది. ఇందుకూరుపేట పోలీసు స్టేషన్‌లో బాధితులు ఆదివారం ఫిర్యాదు చేశారు. దీనిపై కోవూరు సిఐ రామకృష్ణారెడ్డి ఇందుకూరుపేట వెళ్లి విచారించారు. ఇందులో కీలకవ్యక్తిగా భావిస్తున్న మహిళా పోలీసు విజయలక్ష్మిని విచారించడానికి పోలీసులు ఫోన్ చేయగా వస్తానని చెప్పి, రాకుండా వెళ్లినట్లు తెలిసింది. తనకు అత్యంత సన్నిహితుల వద్ద దీనిలో తన పాత్ర చిన్నదని, పెద్దలు చాలా మంది ఉన్నారేని సమాచారం. ఫోన్ ఆప్‌చేసినట్లు తెలిసింది. 2019 నుంచి 2021 వరకు మూడు విడతలుగా వచ్చిన కరోనాతో పెద్ద ఎత్తున నష్టం జరిగింది. జిల్లా వ్యాపితంగా సుమారు 1.62 లక్షల మందికి కరోనా సోకింది. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం బాధితుల కోసం (ఇన్సూరెన్స్ రెగ్యూలేటరీ ఆథారిటీ పాలసీ) పేరుతో కరోనా రక్షక్:, కరోనా కవచ్ అనే రెండు స్కీములు తీసుకొచ్చిన విషయం ప్రజలకు పెద్దగా తెలియలేదు. కొందరు వ్యక్తులకు మాత్రమే ఇలాంటి స్కీమ్ ఉందని, దానికి ఏయే సర్టిఫికెట్లు కావాలనే విషయం తెలిసినట్లు సమాచారం. దీనిని ఆసరా చేసుకున్న కొందరు ఈ భారీ స్కామ్‌కు సిద్ధమైనట్లు తెలిసింది. ఇది ఒక్కరితో జరిగే పనికాదని, ఆసుపత్రి యాజమాన్యం, వైద్యశాఖ లోని కొందరు వ్యక్తులు, ఇన్సూరెన్స్ అధికారుల హస్తం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కరోనా సోకి, 74 గంటలు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నట్లు సర్టిఫికెట్‌తోపాటు, కరోనా పాజిటీవ్ రికార్డులు కావాల్సి ఉంది. దీనిని గుర్తింపు కలిగిన ఆసుపత్రుల నుంచి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇది ఇన్సూరెన్స్ స్కీమ్ కావడంతో అదికారులు విచారణ జరపాలి. కరోనా వచ్చింది,? ఎక్కడ చికిత్స తీసుకున్నారు,? ఆ వ్యక్తి ఉన్నారా .? అనేవి పరిశీలించి కంపెనీలకు పంపితే అక్కడ నుంచి డబ్బులు రావాల్సి ఉంటుంది. బజాజ్ ఇన్సూరెన్స్ కంపెనీ, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇందులో బాగస్వామ్యులుగా ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. కరోనా బాధితులకు సంబంధించిన పాజిటీవ్ సర్టిఫికెట్, ఆధార్, పాన్‌కార్డు, ఆసుపత్రి సర్టిఫికెట్, అకౌంట్ బుక్స్ లాంటివి ఆన్‌లైన్ ఆప్‌లో చేసుకోవాలి. ఇన్సూరెన్స్ కంపెనీ ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.2.5 లక్షల బీమా సొమ్మును అకౌంట్‌లో వేసింది.

సమాచారం. పోలీసులు, ఇన్సూరెన్స్ కంపెనీలు విచారణ వేగవంతం చేస్తే, అవినీతి, పరులందరూ బ్యూలోకి వస్తారు. మరికొందరు ఈ విషయాన్ని నీరు కార్చడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఏం జరుగుతుందో చూడాలి...



విజయలక్ష్మికి ట్రాన్స్‌ఫర్ చేసిన ఖాతా వివరాలు

ఇందుకూరుపేట బిట్-1 సచివాలయంలో పనిచేసే మహిళా పోలీసు విజయలక్ష్మి, నెల్లూరుకు చెందిన హోంగార్డు జలీల్, వాలంటీర్ భరత్ కుమార్‌లో లబ్ధిదారులను గుర్తించి, వారి వద్ద నుంచి సర్టిఫికెట్లు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఇక్కడ నుంచి వెళ్లిన తరువాత ఆ రికార్డులు అప్‌లోడ్ చేయడం, నగదు రావడం,తిరిగి వారి నుంచి మళ్లీ తిరిగి తమ అకౌంట్‌లో వేసుకోవడం విషయాలను మరి కొందరు చూసినట్లు సమాచారం. విజయలక్ష్మిని విచారిస్తే అందులో ఉన్న ఇతరుల వివరాలు బయట కొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. నకిలీ రికార్డులు ఎక్కడ సృష్టించారు. ఎవరు ఇచ్చారు. వారి వాటా ఎంత అనే విషయాలు బయటకు రావాల్సి ఉంది. విజయలక్ష్మి ప్రస్తుతం అందుబాటులో లేకుండా ఫోన్ ఆప్‌చేసుకున్నట్లు

ఉద్యోగులు, సిబ్బందిని బుట్టలో వేసు కున్నారు. ఈ స్కీమ్ కింద డబ్బులు ఇప్పిస్తామని మీ ఆధార్, బ్యాంకుబుక్, పాన్‌కార్డు ఇవ్వండని సచివాలయంలో పనిచేసే 15 మంది దగ్గర తీసుకున్నారు. వీరిలో కొందరికి కరోనా రాగా, కొందరికి కరోనా లేదు. అయినప్పటికీ ఈ వ్యక్తులు కరోనా పాజిటీవ్ సర్టిఫికెట్ సంపాదించారు. అప్లోడ్ చేశారు. విచారించి నగదు ఇవ్వాల్సిన ఇన్సూరెన్స్ అధికారులు కలిసి సుమారు రూ.30 లక్షల ఆయా సిబ్బంది అకౌంట్‌కు నగదు బదిలీ చేయించారు. ఒప్పందంలో భాగంగా ఒక్కొక్కరికి రూ.5 వేల ఇచ్చి మిగిలిన సొమ్మును తమ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. వీరి మధ్య విభేదాలు రావడంతో అసలు విషయం బయటకొచ్చింది. కేవలం ఒక్క సచివాలయం పరిధిలోనే రూ.30 లక్షలు దిగమింగిన ఈ ముఠా జిల్లా వ్యాపితంగా ఎన్ని కోట్లు కాజేశారోనని అనుమానాలు కలుగుతున్నాయి. రాష్ట్ర వ్యాపింగా కోట్లాది రూపాయలు కాజేసినట్లు అనుమానాలు కలుగుతున్నాయి. ఆసుపత్రులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, ఇతర వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం విచారణ జరిపితే భారీ కుంభకోణం బయటపడే అవకాశాలు ఉన్నాయి. దీనిని చూసిన జనం విస్తుపోతున్నారు. కరోనా సమయంలో సాయం చేయాల్సింది పోయి, స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఇందుకూరుపేటలో వారిపై ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు 15 మంది బాధుతులుండగా సచివాలయ పరిధిలో మరో 50 మంది వరకు ఉంటారని తెలుస్తోంది. ఇది మండలం, జిల్లా, రాష్ట్ర వ్యాపింగా ఎలా ఉంటుందో చూడాలి.

రెజ్లర్లను వేధించిన

బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాల్సిందే..!

ఐద్వా, ప్రజా సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు :మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసిన డబ్ల్యు ఎఫ్ ఐ. చైర్మన్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఆవాజ్ కమిటీలు డిమాండ్ చేశాయి. సోమవారం స్థానిక పూలే విగ్రహం సమీపంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం వి రమణ, ఐద్వా నగర కార్యదర్శి పద్మ మాట్లాడుతూ దేశ కీర్తిని చాటిన రెజ్లర్లను లైంగికంగా వేధించిన బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలన్నారు. ప్రపంచ దేశాలు ఓడించి రెజ్లింగ్ లో గోల్డ్ మెడల్ సిల్వర్ మెడల్ సాధించినటువంటి మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసిన వారిని శిక్షించాలని ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర రెజ్లర్లు చేస్తున్నటువంటి దీక్షను పోలీసులు భగ్నం చేయటం దుర్మార్గమన్నారు. మహిళలు, విద్యార్థులు అని చూడకుండా వాళ్లపై దాడి చేసినటువంటి పోలీసులను వెంటనే శిక్షించాలని అన్నారు. బిజెపి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రతి సభలో బేటీ బచావో.. బేటీ పడావో.. అంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేస్తూ మరో పక్క ఇటువంటి చర్యలకు పాల్పడటం దారుణమన్నారు. బిజెపి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉంటే వెంటనే రెజ్లర్ డిమాండ్ నెరవేర్చాలని, బ్రిజ్ బీజు భూషణ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించని పక్షంలో దశలవారీగా జిల్లాలో కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బీపీ నరసింహ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు టి శివ కుమారి, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి నరేంద్ర, ఆవాజ్ నగర అధ్యక్షుడు ఎస్కే ఫయాజ్ డివైఎఫ్ఐ కండి కోటేశ్వరరావు పాల్గొన్నారు.




రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

'రెడ్‌క్రాస్' సేవలకు గుర్తింపు

బంగారు పతకం అందుకున్న ఎంఎల్‌సి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు :రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లా నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరంతరం రెడ్ క్రాస్ అభివృద్ధికి పాటుపడుతున్న చైర్మన్, ఎంఎల్‌సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి బంగారు పతకం వరించింది. సోమవారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా రాజ్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ప్రెసిడెంట్ అబ్దుల్ నజీర్ 2022-23 సంవత్సరానికి సంబంధించి 26 జిల్లాల్లో రెడ్ క్రాస్ ద్వారా ఉత్తమ సేవలందించిన 11 మందికి గోల్డ్ మెడల్స్ అందజేశారు. చంద్రశేఖర్‌రెడ్డి నెల్లూరు జిల్లా నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడంతోపాటు రెడ్‌క్రాస్‌కు వ్యక్తిగతంగా రూ. 25 లక్షల విరాళం అందజేశారు. ఈ నేపథ్యంలో చంద్రశేఖర్‌రెడ్డికి ఈ గౌరవం దక్కింది. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ చేస్తున్న సేవలను కొనియాడారు. రెడ్ క్రాస్ స్టేట్ ఛైర్మెన్ శ్రీధర్ రెడ్డి, స్టేట్ జనరల్ సెక్రటరీ ఏ కే ఫరీడా లు రాష్ట్రంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవలను వివరించారు.



బంగారు పతకం అందుకుంటున్న ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

సిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్

నెల్లూరు :సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కావలి పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం. హరి నారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం తన ఛాంబర్‌లో ఎస్‌పి తిరుమలేశ్వర్ రెడ్డి, జెసికూర్మనాద్ ,అడిషనల్ ఎస్‌పి హిమవతి, లతో కలసి జిల్లా అధికారులకు సిఎం పర్యటనకు చేయవలసిన ఏర్పాట్లపై ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొల గించినందున ఆ భూములకు పట్టాలను రైతులకు అందించేందుకు సిఎం 12వ తేదీన కావలి వస్తున్నారన్నారు. హెలిపాడ్ , బహిరంగ సభ జరిగే ప్రదేశాల వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, ఆర్‌డిఒ లు సీనా నాయక్ , మాలోల ఉన్నారు.

కరేడులో జెండా ఆవిష్కరణ

ఉలవపాడు : మండలంలోని కరేడు రామకష్ణాపురంలోని ఎస్‌టి కాలనీ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ కార్మిక దినోత్సవ మేడే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సిపిఎం జెండాను ఆ పార్టీ సీనియర్ నాయకురాలు పొన్నం రామ లక్ష్మమ్మ ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో పాల్గొన్న సిపిఎం ఉలవపాడు మండల కార్యదర్శి జివిబికుమార్ మాట్లాడారు. చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం కార్మికులు రక్తం చిందించి చేసిన పోరాటాన్నిగుర్తు చేశారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఎం కరేడు రామకష్ణాపురం శాఖ కార్య దర్శులు వీసం విజయ్ కత్తి సుజాత, సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌డి గౌస్ బాషా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు డియం రాయుడు, రామ కష్ణాపురంలోని సిపిఎం సభ్యులు కత్తి జాలమ్మ, మల్లవరపు అంకమ్మరావు, కత్తి కోటయ్య అన్నం వెంకటేశ్వర్లు, మాలికల ధనలక్ష్మి, మంగమ్మ, నంబూరి నాగమ్మ పాల్గొన్నారు.



నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-సైదాపురం : మండలంలోని తురి మెర్ల, గిద్దలూరు గ్రామాలలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు- నేడు నిధులతో జరుగుతున్న అభివద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపిడిఒ వెంకటేశ్వర్లు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. జూన్ మొదటి వారంలో పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట ఎంఇఒ దయాకర్, డిఇ మణాళిని, ఎఇ దయాళ్ ఉన్నారు.

అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రజాశక్తి - ఉలవపాడు : ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివద్ధి కమిటీ సమా వేశంలో సోమవారం ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఎంపిడిఒ చంచమ్మ, సతీష్, విజయమ్మ, నాగ లక్ష్మీ పాల్గొన్నారు.

విద్యార్థుల ఉత్తీర్ణత శాతంపై విమర్శలు


ప్రజాశక్తి - గుడ్లూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 81 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా 57 మంది విద్యార్థులు ఫెయిల్ కావడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. దీంతో ఉపాధ్యాయుల పనితీరుపై విమర్శలు వెల్లు వెత్తు తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి -కందుకూరు : స్థానిక శారద నర్సింగ్ హోమ్‌లో జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన కనిపించింది.ఆ నర్సింగ్ హోమ్ మూడో వార్షికోత్సవ సందర్భంగా డాక్టర్ గుండవరపు వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరంతో పాటు రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 70 మంది వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయిం చుకున్నారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందజేవారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30 మంది రక్తం ఇచ్చారు. డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ పేదలకు అందుబాటులో వైద్య సేవలు అందించడానికి శారదా నర్సింగ్ హోమ్ సిద్ధంగా ఉంటుందన్నారు. రక్తదాన శిబిరాన్ని వెంకట శివాజీ షుమార్ట్ అధినేత నరసింహారావు ప్రారంభించారు. డాక్టర్ బ్రహ్మణి, వెంకట శివాజీ షుమార్ట్ అధినేత గుండవరపు వెంకట శివాజీ పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న గుండవరపు నరసింహారావు



రక్త దానం చేస్తున్న దాతలు

'స్పందన' అర్జీలకు సత్వర పరిష్కారం :కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు:'స్పందన' అర్జీలపై ప్రత్యేక దష్టి సారించి, సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డిఆర్ఓ వెంకట నారాయణమ్మతో కలిసి స్పందన నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'స్పందన'లో ప్రజల నుంచి వచ్చే అర్జీలను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కింది స్థాయిలో అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరిం చాలన్నారు. ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చినపుడు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పందన లో వచ్చే ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అవసరమైతే వ్యక్తి గతంగా తనిఖీ చేసి పరిష్కరించాలన్నారు. డిఆర్‌డిఎ, మెప్మా, హౌసింగ్ పిడిలు కె. సాంబశివారెడ్డి, రవీంద్ర, వెంకట దాస్, డిఎం హెచ్‌ఓ పెంచలయ్య, డిపిఓ సుస్మిత, డీఈవో గంగాభవాని, సర్వే రికార్డుల ఏడి హనుమాన్ ప్రసాద్, బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నిర్మలాదేవి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

పోలీస్ కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 92ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్‌పి కె.తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌పి అధికారులనుద్దేశించి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు, బధిరుల సమస్యల పట్ల మానవతాదక్పథంతో సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అడిషనల్ యస్.పి.(అడ్మిన్), (క్రైమ్స్), ఏఆర్ డిఎస్‌పి, సెల్ -2 డిఎస్‌పి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో..

ప్రజా సమస్యల పరిష్కార వేదికగా జరుగుతున్న స్పందన కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు నిబద్ధతతో పరిష్కారాలు అందించాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన వేదికలో కమిషనర్ పాల్గొని "డయల్ యువర్ కమిషనర్" కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్ ను నేరుగా మాట్లాడారు.

పొదుపు మహిళలకు న్యాయం చేయాలి

ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

అనంతసాగరం మండల పరిధిలో పొదుపు మహిళలకు జరిగిన అన్యాయంపై జిల్లా అధికారులు స్పందించి వెంటనే విచారణ చేపట్టి పొదుపు మహిళలకు న్యాయం జరిగేలా చూడాలని ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బీ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో పాల్గొని పొదుపు మహిళలకు జరిగిన నష్టాని వివరించి, సమస్యను పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ అనంతసాగరం మండలంలో మైనార్టీ మహిళలు రోజువారి కూలి పనులు చేసుకునే వాళ్లు 22ఏళ్లుగా భారతి పొదుపు గ్రూపు పేరుతో పొదుపు గ్రూపును నడుపుకుం టున్నారన్నారు. పొదుపు మహిళలు తమ కుటుంబ అవసరాల నిమిత్తం బ్యాంకు నుంచి తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తున్నారన్నారు. అటువంటి పొదుపు గ్రూపు పేరుతో వివో హసీనా బేగం అనే మహిళ రూ. 7. 50 లక్షలు బ్యాంకు నుంచి సభ్యులకు సంబంధం లేకుండా రుణాన్ని తీసుకున్నా రన్నారు. ఈ విషయంపై ఐద్వా ఆధ్వర్యంలో భారతి పొదుపు గ్రూపు మహిళలతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. గ్రామాల్లో చదువు లేని పేద మహిళలు రోజువారి కూలి పనులు చేసుకుంటూ అందులో కొంచెం డబ్బులు పొదుపు గ్రూపులలో దాచుకుంటూ ఉండేవా రన్నారు. వారి కుటుం బాలకు ఆ డబ్బును వినియో గించుకుంటూ బ్యాంకు నుంచి రుణాలను తీసుకొని సకాలంలో చెల్లిస్తూ నిర్వహిం చుకుంటు న్నారన్నారు. నిరక్ష్యరాస్య మహిళలకు కల్లబొల్లి మాటలు చెప్పి వివో బ్యాంకులలో రుణాలు తీసుకోవడం ఫోర్జరీ సంతకాలతో అనంత సాగరంలో ఇంకా అనేక పొదుపు గ్రూపులలో హసీనా బేగం అనే మహిళ సుమారు రూ. 23 లక్షలు సొంత ఖర్చులకు వాడుకున్నారన్నారు. ఈ వ్యవహారంపై పొదుపు సభ్యులు అడిగితే తిరిగి చెల్లిస్తాన,, ఒత్తిడి చేస్తే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తున్నారన్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులను విచారణ చేయించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. స్థానిక పొదుపు మహిళలు రసూల్ ,బి అన్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్‌కె మస్తాన్ బీ

10 రోజులు ప్రజా పోరాటం చేద్దాం ..

22న చలో గాంధీనగర్ -ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ కోసం పది రోజులు ప్రజా పోరాటం నిర్వహిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే 22వ తేదీ చలో గాంధీనగర్‌కు తరలిరావాలని నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం ఎంఎల్ఎ కార్యాలయంలో క్రిస్టియన్‌లో భారీ కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరు నగరంలోని క్రిస్టియన్లు కోసం కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని, మూడేళ్ల నుంచి పోరాటం చేస్తున్నామన్నారు. మూడు సార్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసే రూ.6 కోట్లు ఇవ్వడానికి అంగీకరించారని, ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదన్నారు. అందుకే పోరాటం ద్వారానే సాధించుకోవాలన్నారు. సోమవారం నుంచి పది రోజులు వాట్స్‌ఆప్, పోస్టు కార్డుల ఉద్యమం నిర్వహిస్తామని, అప్పటికీ స్పందించకపోతే నెల్లూరు నగరంలోని ప్రతి చర్చి నుంచి క్రిస్టియన్ సోదరులు తమకు అందుబాటులో ఉన్న ఇసుక, సిమెంటు, ఇటుక రాళ్లు, కంకర ఏదో అందుబాటులో ఉంటే దానిని ఈనెల 22వ తేదీ మహాత్మా గాంధీ నగర్ రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ కోసం స్థలం ఎక్కడ కేటాయించిందో ఆ ప్రాంతంలో క్రిస్టియన్ సోదరులందరూ నిర్మాణ సామగ్రిని తీసుకొచ్చి అక్కడ బైఠాయించాలని పిలుపుని చ్చారు. పోరాటాలు చేస్తే సమస్యలు పరిష్కారం కావని వైసిపికి చెందిన నేతలు చెప్పున్నారని, ఏమాత్రమూ వారికి నీతి,నిజాయతీ చిత్తశుద్ధి ఉన్న క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌కి సంబంధించి నిధులను విడుదల చేస్తున్నట్లు స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ కోసం ఎందాకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. వెంటనే ప్రభుత్వం ఆరు కోట్ల రూపాయల నిధులను విడుదల చేయాలని, ప్రభుత్వం దిగిరాకపోతే ఎంతటి పోరాటానికైనా తాము సిద్ధంగా ఉన్నామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రకటించారు. నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గానికి చెందిన 100 మంది ఫాస్టర్లు, క్రిస్టియన్ నేతల హాజరై పోరాటానికి మద్దతు పలికి తమ వంతు సూచనలు సలహాలు అందజేశారు. నగర మేయర్ పోట్లూరి స్రవంతి టిడిపి జిల్లా నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డితో పాటు పలువురు క్రిస్టియన్ నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ కోటంరెడ్డి


'రెడ్‌క్రాస్' దినోత్సవ వేడుకలు

నెల్లూరు : ప్రపంచవ్యాప్తంగా రెడ్‌క్రాస్ ఉద్యమ వ్యవస్థాపకుడు జీన్-హెన్రీ డ్యునాంట్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని రెడ్‌క్రాస్ సంస్థలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహము దగ్గర నుంచి రెడ్‌క్రాస్ సంస్థ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రెడ్ క్రాస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జీన్-హెన్రీ డ్యునాంట్ జన్మదినాన్ని పురస్కరించుకుని చిత్రపటమునకు పూల మాలలను వేసి వారి సేవలను కొనియాడారు. పేషెంట్లకు వారి సహాయకులకు మజ్జిగ ప్యాకెట్లు , అన్నదానం చేశారు. రెడ్ క్రాస్ కోశాధికారి సురేష్ కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్, యడవల్లి సురేష్, గుణపాటి ప్రసాద్ రెడ్డి, కన్వీనర్లు ఎం.వి.సుబ్బారెడ్డి, టి. భాస్కర్ రెడ్డి, డాక్టర్.వి.వేణు, కొ-కన్వీనర్లు షేక్ పర్వీన్, టి.సురేఖ, ఏ.వి.రమణయ్య, రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి పి.మస్తానయ్య ఉన్నారు.



సమ్మర్ క్యాంప్ ప్రారంభం

ఉలవపాడు : ఉలవపాడు శాఖా గ్రంధాలయంలో విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించాచరు. ముఖ్య అతిథిగా గ్రంథాలయ భవన దాత కె సుచరిత రెడ్డి, ఒగుబోయిన శ్రీను, హాజరయ్యారు. తొలుత కె సుచరిత రెడ్డి విద్యార్థు లను ఉద్దేశించి మాట్లాడారు. చదువును మించిన ధనం లేదన్నారు. విదేశాల్లో సైతం నేను రాణిం చానంటే దానికి ముఖ్య కారణం చదువేనన్నారు. ఈ గ్రామంలో చదువుకునే ప్రతి వారికీ సహాయాపడతానన్నారు. ఓగుబోయిన శ్రీను మాట్లాడుతూ చదువు మనిషిని సమాజంలో ఏ స్థాయికి తీసుకెళుతుందో తానే నిదర్శనమన్నారు. తాను ఎదగటానికి కారణం గ్రంథాలయమే కారణమన్నారు. గ్రంధపాలకుడు డి కోటేశ్వరరావు మాటా డుతూ సోమవారం ప్రారంభించిన ఈ సమ్మర్ క్యాంప్ ఈ నెల 8వ తేది నుండి 11వ వరకు జరుగు తుంద న్నారు. దేవరపల్లి వెంకట కష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారి పేరు మీద బహుమతులు అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి దోహదపడుతున్న సుచరితరెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



విరాళం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : స్థానిక జనార్ధన స్వామి దేవాలయ నిర్మాణానికి కీర్తిశేషులు ఎన్ వెంకటరంగయ్య భార్య జయలక్ష్మి జ్ఞాపకార్థం కుమారుడు సుధాకర్ రావు, కోడలు లక్ష్మీపార్వతి సరస్వతి రూ.25 వేలు విరాళంగా సోమవారం అందజేశారు. ఎంఎల్ఏ మానుగుంట మహీధర్ రెడ్డి ద్వారా ఈ విరాళం అందించారు. దేవస్థానం ఈఒ బైరాగి చౌదరి, దేవాలయ కమిటీ చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం పాల్గొన్నారు.

సమస్యలపై వినతులు

ప్రజాశక్తి -కందుకూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో 0 అర్జీలు వచినట్లు మున్సిపల్ కమీషనర్ ఎస్ మనోహర్ తెలిపారు. సెక్షన్ హెడ్స్ పాల్గొన్నారు.

'పది'లో సత్తా చాటిన మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - లింగసముద్రం :పదో తరగతి ఫలితాలల్లో మండలంలోని తిమ్మారెడ్డిపాలెం ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ షేక్ మొహమ్మద్ హఫ్తార్ చెప్పారు. 'పది' ఫలితాల్లో జిల్లాలో ఉన్న మోడల్ స్కూల్స్‌లలోకెల్లా అత్యధిక ఉత్తీర్ణత సాధించి (98.14) ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.టి.శ్రావ్య సంకీర్తన అత్యధికంగా 573 మార్కులు సాధిచి మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. 566 మార్కులతో వి.అజయ్ ద్వితీయ స్థానం సాధించారని చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేల్లా కృషి చేసిన ఉపాధ్యాయ బృందానికి ఆయన అభినందనలు తెలిపారు.



టి.శ్రావ్య సంకీర్తన

గ్రామాల అభివృద్ధే ధ్యేయం : కాకాణి

పొదలకూరు :గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం గ్రామాల అభివద్ధి కోసమేని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మహ్మదాపురంలో గడప గడపకుమన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాకాణి మాట్లాడుతూ మహ్మదాపురంలో సుమారు 2 కోట్ల 80 లక్షల అభివద్ధి పనులు పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేస్తుండడం సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో శంకుస్థాపనలు తప్ప ప్రారంభోత్సవాలు లేవని గుర్తు చేశారు. వైసిపి నాయకులు జి గోపాల్ రెడ్డి కే చిన్న బ్రహ్మయ్య మద్దిరెడ్డి రమణారెడ్డి వాకాటి శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.



పారదర్శకంగా పనుల నిర్వహణ : వైసిపి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు పారదర్శకంగా చేశామని, గ్రామంలో రైతులందరినీ అధికారులు విచారించే ఈ నివేదికలు తయారు చేశారని వైసిపి నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశాలతో ఆత్మకూరులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో జెడ్‌పిటిసి పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, ఇతర నాయకులతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి కేతా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ చంద్రా మల్లికార్జున అనే వ్యక్తి వైసిపిలో చేరినప్పటికీ కొంతకాలం వరకు ఉన్నారని, అనంతరం టిడిపి నాయకుల ప్రచార కార్యక్రమాల్లో సైతం పాల్గొన్నారని, ఆయన వైసిపికి చెందిన వ్యక్త కాదన్నారు. 2020-21లో అప్పారావుపాళెంలో టెండర్ వర్కులు జరిగాయని, 2021లో వరదలు రావడంతో పంట పొలాలు పూర్తిగా నాశనమయ్యాయని, ఆ సంవత్సరం మళ్లీ పంటలు వేసే అవకాశం కూడా లభించలేదన్నారు. ఎలాంటి అవకతవకలు జరగలేదని రైతులు వారికి తెలిపారన్నారు. జెడ్‌పిటిసి పెమ్మసాని ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ గతంలో అప్పారావుపాళెంలో కూర్చునేందుకు కూడా ఎలాంటి ఏర్పాటు ఉండేది కాదని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామానికి అవసరమైనవన్నీ ఏర్పాటు చేస్తూ అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. రైతు భరోసా కేంద్రం, సచివాలయం, హెల్త్ క్లినిక్ నిర్మాణాలు చేపట్టామని, ఇప్పటికే సచివాలయ భవనం నిర్మాణం పూర్తయిందని వివరించారు. గ్రామాలను అభివృద్ధి చేసే పనిలో మేమంతా ఉంటే లేనిపోనివి సృష్టించి స్పందనలో అర్జీలు ఇచ్చి ఆ కార్యక్రమ ఉద్దేశ్యాన్నే మార్చి వేస్తున్నారని, ఇది సరైన పని కాదని తెలిపారు. అధికారులు రైతులందరిని విచారించారని, అనంతరం జిల్లా అధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. బోయలచిరువెళ్ల సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, నాయకులు బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, తోడేటి అశోక్, మంజాన్ బాషా తదితరులున్నారు.

నగర పంచాయతీలో వేలం నిర్వహణ

ప్రజాశక్తి-అల్లూరు : స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం వేలం నిర్వహణ చేపట్టగా నార్త్ మోపూరు చెరువుకు సంబంధించి తుమ్మతాటి భాస్కర్ రూ.3 లక్షల 45 వేలకు చెరువుని దక్కించుకున్నారు. అలాగే నార్త్ మోపూరు చేపలగుంతను చేజర్ల వెంకటేశ్వర్లు రూ.16,500లకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ మాట్లాడుతూ సాయంత్రం లోపు పాట నిర్వాహకులు నగదును చెల్లించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అల్లూరు బస్టాండ్, రోడ్డు మార్జిన్ వ్యాపారస్తులకు సంబంధించి ఎవరూ వేలం పాటలో పాల్గొనలేదని తెలియజేశారు.

జనసేన నేతలతో ముఖాముఖి

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని ఇస్కపల్లిపాలెంలో జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ సోమవారం ఆ పార్టీ నేతలతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కొండూరు నాగేంద్ర, మండల అధ్యక్షులు కారుమంచి కార్తీక్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని గ్రద్దగుంట, బట్ర కాగొల్లు, పురిణి గ్రామాల్లో సోమవారం కోవూరు సబ్ సెబ్ సిఐ నరహరి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా, గంజాయిని నిషేధించినట్లు తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని తూర్పు గోగులపల్లి గ్రామంలో కోడూరు రవి మరణించగా ఇఒపిఆర్‌డి పెంచలరెడ్డి సోమవారం వైఎస్‌ఆర్ బీమాలో భాగంగా అంత్యక్రియలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : సీనియర్ జర్నలిస్ట్ గవిని చక్రపాణి 67వ జయంతి సందర్భంగా కొత్తూరు మండల కార్యాలయం వద్ద వారి కుమారుడు శ్రీ సాయిరాం స్కూల్ కరస్పాండెంట్ జివి జగదీశ్వరరావు ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపిడిఒ నాగేంద్రబాబు, లలిత మహేశ్వర ఆశ్రమ పీఠాధిపతి మహేశ్వర స్వామి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుగా చక్రపాణి చేసిన సేవలను గుర్తు చేశారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : లలిత మహేశ్వర ఆశ్రమ పీఠాధిపతి రామాయణం మహేష్ స్వామి ఆధ్వర్యంలో పదవ తరగతి ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించి విజయదరహాసం మెరిపించిన శ్రీ సాయిరాం ఇంగ్లీష్ మీడియం స్కూల్ పదవ తరగతి విద్యార్థులను 588 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన ఎం మోహన ప్రియను ఘనంగా సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జివి జగదీశ్వర్ బాబు మాట్లాడుతూ విద్యార్థులందరూ అనుకున్న లక్ష్యాలను చేరి ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తేవాలన్నారు. తమ పాఠశాల 100శాతం ఉత్తీర్ణత సాధించడంపై ఆనందం వ్యక్తపరిచారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాధారాణి, కార్పొరేటర్లు, నాగరాజు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి మర్రిపాడు : మండలంలోని డిసి పల్లి పొగాకు వేలం కేంద్రానికి పొంగూరు క్లస్టర్‌కు చెందిన రైతులు 877బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకురాగా వీటిలో 847బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 16పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. అధిక బరువుతో ఉన్న 14పొగాకు బేళ్లను వేలానికి తిరస్కరించారని తెలిపారు. వీటిలో ఎన్ఎస్ 05ని ఆర్10ఆర్ ఆర్ 01ఉన్నాయన్నారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.200 కాగా, కనిష్ఠ ధర రూ.178, సగటు ధర రూ.196.39 కాగా, 10మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొన్నారన్నారు.

ఆర్‌డిఒకు ఎంఎల్‌ఎ సన్మానం

ప్రజాశక్తి-కావలి : ప్రతి అంబేద్కర్ జయంతి రోజున రక్తదానం చేస్తూ యువతకు స్ఫూర్తిగా నిలిచిన కావలి ఆర్‌డిఒ వికె.శీనా నాయక్‌ను సోమవారం ఆర్.డి.ఒ. కార్యాలయంలో సంయుక్త 'సేవాసంస్థ' ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్ నాయుడు, మాజీ కౌన్సిలర్ గంధం ప్రసన్నాంజనేయులు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి అంబేద్కర్ జయంతి రోజున రక్తదానం చేస్తూ, యువతకు స్ఫూర్తినిస్తున్న కావలి ఆర్‌డిఒ వికె శీనానాయక్‌ను అభినందించారు.

గిరిజనులకు దుస్తులు వితరణ

ప్రజాశక్తి-కావలి : 'నా ఫ్రెండ్స్' ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాలేరుగుంట కాలనీ పేద గిరిజన ప్రజలకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అన్నవరం హనుమతకుమార్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుంచే ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండి పాల్గొనాలని, ఎటువంటి సౌకర్యాలు లేని కాలేరుగుంట కాలనీలోని గిరిజన పేదప్రజలకు దుస్తులు ఇచ్చే కార్యక్రమంలో తాను భాగస్వామి అవ్వడం చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహేష్, సంస్థ సభ్యులు చరణ్, వినయ్, యుగేష్, హరి, ప్రశాంత్, పాల్గొన్నారు.

మున్సిపల్‌లో యథావిధిగా స్పందన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ పరిధిలోని అన్ని సెక్షన్ల మెప్మా సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం స్పందన జరుగుతుందని, ప్రజలు ఈ సమస్యలను స్పందనలో తెలుపుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని తెలియజేశారు. ఇచ్చిన అర్జీలకు ప్రత్యేకమైన పరిష్కారం 24 గంటల్లో పరిష్కరించే కృషి చేస్తామన్నారు.

6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-కలిగిరి : మండలంలోని స్థానిక ఆదర్శ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎ.శ్రీను తెలియజేశారు. 5వ తరగతి పాసైన విద్యార్థులు 9వ తేదీ నుండి apms.ap.gov.inలో అప్లై చేసుకోవాలని 25వ తేదీ ఆఖరు అని ప్రిన్సిపాల్ తెలియజేశారు. 11న ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు.

కావలిలో 'జనంలోకి జనసేన'

ప్రజాశక్తి-కావలి : కావలి రూరల్ అధ్యక్షులు తుబ్బూరు తిరుపతి స్వామి ఆధ్వర్యంలో 'జనంలోకి జనసేన' 50వ రోజు కార్యక్రమం కావలి రూరల్ మండలం రామచంద్రాపురంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ఒక్క అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే యువతకు ఉపాధి చూపుతామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, సిద్దు, తోట శేషయ్య, విద్యార్థి నాయకుడు వినయ్, హరీష్, తోట సాయి, చంటి, మనోజ్, రవీంద్ర, చిన్నా, శ్రీహరి, జోషి, వాహిద్, బ్రహ్మయ్య, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

బ్రిజేష్ భూషణ్‌ను అరెస్టు చేయాలి

- ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఆవాజ్ ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
రెజ్లర్లపై లైంగిక దాడి చేసిన భారతదేశ రెజ్లింగ్ అధ్యక్షుడు బ్రిజేష్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేసి, పదవి నుండి తొలగించాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఆవాజ్‌ల ఆధ్వర్యంలో సిపిఎం కార్యాలయం నుండి ర్యాలీగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు గుల్జారు బేగం మాట్లాడుతూ ఎంతోమంది మహిళలపై లైంగిక దాడి జరుగుతుందని, వాళ్లకు మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. అయినా మోడీ మనసు ఏమాత్రం కరగలేదని ఐద్వా నాయకురాలు గుల్జర్ బేగంఅన్నారు. బిజెపి మతతత్వాన్ని రెచ్చ కొట్టడమే కాకుండా మహిళలకు నీచంగా చూస్తున్నారని తెలిపారు. ఆవాజ్ జిల్లా నాయకులు యస్థాని మాట్లాడుతూ బ్రిజేష్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని రెజ్లింగ్ క్రీడాకారులకు రక్షణ కల్పించాలని కోరారు. జనవరి నుండి వేసిన కమిటీని ఇంతవరకు పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ఆ విషయాన్ని మోడీ ప్రజలకి చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దేశ ప్రధానికి ఎన్నికలే ప్రధానంగా ఉన్నాయని దేశంలో మహిళల రక్షణ ముఖ్యం కాదన్నారు. ఆయన మాట్లాడితే దేశంలో 80శాతం హిందువులు ఉన్నామని హిందువులకు రక్షణ కల్పిస్తామని చెప్పడం కానీ సాక్షి మాలిక్ హిందువే కదా.. ఆమెకు రక్షణ కల్పించలేరా అని ప్రశ్నించారు. రక్షణ కల్పించలేని హిందూ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు అధికారంలోకి వచ్చిన తర్వాత రక్షణ లేదంటే వెంటనే పదవులకు రాజీనామా చేయాలన్నారు. వేరే వాళ్లు వచ్చి హిందువులకు రక్షణ కల్పిస్తారన్నారు. భారతదేశంలో జీవిస్తున్న అన్ని కుల మతాలకు అతీతంగా రక్షణ కల్పిస్తారన్నారు. కులాలు మతాలు రెచ్చగొట్టి ఈ దేశాన్ని చిన్న భిన్నం చేయొద్దన్నారు. డివైఎఫ్ఐ నాయకులు నంద శీను మాట్లాడుతూ దేశంలో తలమానికగా ఉన్న క్రీడాకారులను దేశ ప్రతిష్టను తెచ్చే క్రీడాకారులపై లైంగిక దాడులు చేయడం చాలా బాధాకరమన్నారు. దేశాన్ని పరిపాలించే బిజెపి ప్రభుత్వం బేటి బచావో అనే నినాదం అంటూ మహిళా క్రీడాకారులపై లైంగిక దాడులు చేయడం శోచనీయమన్నారు. వెంటనే నిందితులను అరెస్టు చేసి క్రీడాకారులకు న్యాయం చేయాలని వాళ్లు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, నాయకులు షేక్ సంధాని, ఆళ్ల హజరత్తయ్య, ఐద్వా నాయకురాలు కొండ లక్ష్మమ్మ, మహబూబ్ బాషా, గద్దర్ బాబు, రమణయ్య తదితరులు ఉన్నారు.

తాగునీరు అందించాలి : సిపిఎం


ఆర్.డి.ఒ.కు వినతి పత్రం అందజేస్తున్న సి.పి.ఎం. నాయకులు

ప్రజాశక్తి-కావలి
పట్టణంలో పేదలు నివసించే ఏరియాల్లో ప్రజలకు పూర్తిగా తాగునీటి సరఫరా జరిగేట్లు చర్యలు చేపట్టాలని, కోరుతూ, సోమవారం ఆర్.డి.ఒ. వి.కె.శీనానాయక్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సి.పి.ఎం. పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ పట్టణంలో పలు ప్రాంతాల్లో ప్రతిరోజూ తాగునీరు సరఫరా జరగడం లేదన్నారు. అందువల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాగునీటి సరఫరా లేని ప్రాంతాల్లో మున్సిపాలిటీ తాత్కాలికంగా ట్యాంకర్లతో అరకొరగా తోలుతున్నారని ఆరోపించారు. పట్టణంలోని ముసునూరు, చంద్రబాబు నగర్, ఇందిరమ్మ గ్రీన్ సిటీ, బుడమగుంట కాలనీలు, సుచేతా నగర్, వెంగాయగారిపాలెం, ఇంకా మరికొన్ని ప్రాంతాలకు కొన్ని నెలలుగా మున్సిపాలిటీ వాటర్ సరఫరా కావడం లేదన్నారు. అంతేగాక కొన్ని ప్రాంతాలకు ఇప్పటికి పూర్తిగా నీటి సరఫరా కావడం లేదని తెలిపారు. ట్యాంకర్ల ద్వారా తోలుతున్న నీళ్ల 3రోజులకు, 5రోజులకు ఒకసారి పోస్తున్నందున చాలీచాలని నీళ్లతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా పట్టణానికి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఉన్నప్పటికీ, అమృత్ పథకం కింద నీటి సమస్యలు తీర్చేందుకు సుమారు రూ.200 కోట్లకుపై బడి నిధులు మంజూరు అయినప్పటికీ పూర్తిగా నీటి సమస్య పరిష్కారం కాలేదన్నారు. కనుక వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణ ప్రజలకు ప్రతిరోజూ పూర్తిగా నీటి సరఫరా జరిగేటట్లు చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సి.పి.ఎం. నాయకులు వై.కృష్ణమోహన్, జి.మధుసూధన రావు, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-కావలి : కావలిలో 12న జరిగే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి బహిరంగ సభకు ప్రజలు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం కావలిలో చుక్కల భూముల సమస్యను పరిష్కరించేందుకు జిఒ విడుదల చేస్తారని, తద్వారా దాదాపు 35వేల ఎకరాల చుక్కల భూముల్లో ఉన్న రైతులు, గృహ యజమానుల సమస్యలు తీరిపోనున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి కావలికి వస్తుంటే ఏ పార్టీ వారైనా స్థానిక సమస్యలను సి.ఎం. దృష్టికి తీసుకుని వచ్చి, పరిష్కరించుకోవాలే గాని, అనవసర విమర్శలు చేయడం ప్రతిపక్ష నాయకులకు భావ్యం కాదన్నారు. వైసిపి నాయకులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, పొనుగోటి అనూరాధ, గంధం ప్రసన్నాంజనేయులు, కనుమర్లపూడి వెంకట నారాయణ, జంపాని రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

పసుపు యార్డ్ నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరిలో పసుపు యార్డ్ నిర్మించి పసుపు రైతులు ఆదుకోవాలని ఎపి రైతు సంఘ నాయకులు కాకు వెంకయ్య సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. సోమవారం మండల పరిధిలోని బండగానిపల్లి పంచాయతీ సచివాలయం ఎదుట నిరసన తెలిపి సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరల ప్రకారం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది కూడా త్వరగా ఈ యార్డును నిర్మించి పసుపు రైతులను భయాందోళన చెందకుండా కొనుగోలు చేసి ఈ ప్రాంత రైతాంగ కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణం ఏర్పాటు చేయాలన్నారు. ఎంపిటిసి కాకు విజయ, రైతులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మొదటివిడత భూ సర్వే పూర్తి

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎంపిక చేసిన మండలాల్లో మొదటి విడత భూ సర్వే పూర్తి అయ్యిందని ఆర్‌డిఒ. సాదు కరుణకుమారి అన్నారు. సోమవారం డిఐఓ నరసింహ మూర్తి సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో 9 గ్రామాల్లో సర్వే పూర్తయిందని నువ్వురుపాడు, కురుకల్లుపాడు జంగాల కండ్రిక, హసనాపురం కొత్తపల్లి నెల్లిపల్లి గొల్లపల్లి, బెడుసుపల్లి, కామిరెడ్డిపాడు, గ్రామాల్లో మొదటి విడత సర్వే పూర్తయిందని స్టోన్ ప్లాంటేషన్ పూర్తిస్థాయిలో జరిగిందని తెలిపారు.

భోజన ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-కావలి : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా విజ్ఞప్తుల దినం 'స్పందన'కు వచ్చే అర్జీదారులకు ఇకపై భోజనం ఏర్పాటు చేస్తామని ఆర్‌డిఒ వి.కె.శీనానాయక్ తెలిపారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో భోజన కౌంటర్‌ను ఆర్‌డిఒ ప్రారంభించారు. రెడ్‌క్రాస్ సంస్థ అర్జీదారులకు భోజనం అందించేందుకు ముందుకు వచ్చిందన్నారు. భోజనం ఏర్పాటు చేసిన డాక్టర్ బెజవాడ రవికుమార్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, కార్యదర్శి గంధం ప్రసన్నంజనేయులు, సిబ్బంది బి ఎస్ ప్రసాద్, మధు రెడ్డి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజాశక్తి-మర్రిపాడు
గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పడమటి నాయుడుపల్లి సచివాలయం పరిధిలోని కదిరినాయుడుపల్లి, కుంటనీళ్లపాడు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షంలోనూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అందజేసిన సంక్షేమ పథకాలను గురించి వారికి వివరించారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను నమోదు చేసుకుని పరిష్కరిస్తామని, హై లెవల్ కెనాల్ పనులు ముమ్మరం చేస్తామని వారికి హామీనిచ్చారు. ఎంఎల్ఎ పర్యటనలో భాగంగా కాలనీవాసులు రోడ్లు మంజూరు చేయాలని విన్నవించడంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి రోడ్డు నిర్మాణం చేయిస్తామని తెలిపారు. కుటుంబం అనారోగ్య సమస్యపై ఎంఎల్ఎ దృష్టికి తీసుకు రావడంతో పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2012లో హైలెవల్ కెనాల్ నిర్మాణ పనులు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించారని, గత రెండు ప్రభుత్వాలు ఈ నిర్మాణ పనులను నిర్లక్ష్యంతో చేయడంతో ఈ సచివాలయం పరిధిలోని రెండు పంచాయతీలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయని వివరించారు. ఇక్కడి ప్రజలు సైతం తీవ్ర నష్టపోయారన్నారు. వైసిపి ప్రభుత్వంలో రెండు సంవత్సరాలు కోవిడ్ కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొని ఆర్థికంగా వెనుకబడినప్పటికీ ప్రస్తుతం ఫేజ్-2 పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, 6 నెల వ్యవధిలోనే ఈ సమస్యల్ని పరిష్కరించి ఈ పంచాయతీల ప్రజలకు న్యాయం చేసేలా చూస్తామని వివరించారు. ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పలు అభివృద్ధి పనుల గురించి వచ్చిన కథనాలపై స్పందించారు. మంచి చేసే వారిపై విమర్శలు చేస్తూ కొన్ని మీడియా ఛానెళ్లు, పత్రికలు ఉన్నాయని, దీని వల్ల పనిచేసే వారికి ఇంకా మంచి గుర్తింపు ప్రజల్లో లభిస్తుందన్నారు. కదిరినాయుడు పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతూ 10వ తరగతి ఫలితాల్లో 577 మార్కులు సాధించిన ఉప్పనూతల మహిమా అనే విద్యార్థిని అభినందించి ఆ విద్యార్థినిని శాలువాతో సత్కరించి ఆమెతో కలసి కేక్ కట్ చేశారు. ఉన్నత చదువుల కోసం ప్రోత్సాహక నగదు బహుమతి అందించేలా కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ మోహన్‌రెడ్డి, సర్పంచ్ జయమ్మ చిన్న కొండయ్య, నరసింహారావు, రామ్మోహన్, వైసిపి నాయకులు బేరి రామ్మోహన్ రెడ్డి, ప్రతాపరెడ్డి, రామకృష్ణారెడ్డి, మీరావలి, లక్ష్మీరెడ్డి, రామిరెడ్డి ఆదినారాయణ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయకట్టు డొంకలో ఆక్రమణలు



ప్రజాశక్తి-ఇందుకూరుపేట
వ్యవసాయ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్న వ్యవసాయం ఆయకటు డొంకలో ఆక్రమణలు చేపడుతున్నారని లేబూరు రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు సోమవారం తహశీల్దార్‌కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌ను కలిసి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి తమకు న్యాయం చేయాలని వినతి పత్రం అందించారు. అనంతరం సిపిఎం సీనియర్ నాయకులు, లేబూరు గ్రామస్తులు గూడూరు ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ తమ వ్యవసాయ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాల రాకపోకలకు సర్వే నెంబర్ 374లో 500 ఎకరాల ప్రభుత్వ ఒఎన్‌జిసి రహదారి డొంకలో రాకపోకలు సాగిస్తున్నామని తెలిపారు. అయితే నిర్వాసితుల పేరుతో ఈ దారిని ఆక్రమించుకొని దారికి అడ్డంగా పశువులను కట్టివేసి గ్రామ రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. అయితే డొంక ఆక్రమణ నిర్వాసితులు స్థానిక శాసనసభ్యులను కలిసి తమకు పక్కాగా పట్టాలు మంజూరు చేయాలని కోరడంతో ఆయన వాస్తవాలు విచారించకుండానే నిర్వాసితులకు పట్టాలు మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తుందన్నారు. ఈ విషయంలో తమరు పూర్తి విచారణ జరిపి నిర్వాసితులకు మరో ప్రాంతంలో నివేశన పట్టాలు మంజూరు చేసి గ్రామస్తులకు అవసరమైన డొంకను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

అత్యాచారయత్నం నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని దాసరపల్లి సమీపంలో అత్యాచారయత్నానికి ప్రయత్నించిన నిందితులను సోమవారం స్థానిక పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు పంపునట్లు సిఐ గిరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. దాసరపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరులోని ఓ ప్రయివేటు వైద్యశాలలో వైద్యం చేయించుకుని తిరుగు ప్రయాణంలో రాత్రి 10 గంటలకు ఉదయగిరి బస్టాండుకు చేరుకుంది. స్వగ్రామానికి వెళ్లేందుకు ఆటోను బాడుగకు మాట్లాడుకోగా ఆటో డ్రైవర్ సయ్యద్ రహీం తనను మరో ఆటో డ్రైవర్ షేక్ ఖాసిం ఎక్కించుకొని ఆమెతో దాసరిపల్లికి వెళ్లేటప్పుడు మార్గం మధ్యలో జామాయిల్ చెట్లల్లోకి ఆటోను తీసుకుని వెళ్లి తనను బలత్కరించేందుకు ప్రయత్నించగా గట్టిగా కేకలు వేస్తూ బాధితురాలు రోడ్డుపైకి రావడంతో నిందితులు ఆటోతో పరారైనట్లు సిఐ తెలిపారు. ఎస్ఐ ఎన్.ప్రభాకర్ కేసు నమోదు చేసుకుని ఆటోను స్వాధీన పరుచుకుని నిందితులను కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. సమావేశంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎన్.ప్రభాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెడుగుడు విజేత కోవూరు జట్టు

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు దళితవాడలో రెండు రోజులుగా జరిగిన జిల్లాస్థాయి చెడుగుడు పోటీలలో తువర పుల్లయ్య మెమోరియల్ కోవూరు జట్టు విజేతగా నిలిచి ప్రథమస్థానం కైవసం చేసుకుంది. ఉలవపాటి శ్యాంబాబు మెమోరియల్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించారు. వెస్ట్ ఈ పోటీలలో ఉత్తమ క్రీడను కనబరిచిన బెస్ట్ అఫెయిన్స్ ప్లేయర్ జాన్ బెన్ని. బెస్ట్ డిఫిన్స్ ప్లేయర్ సునీల్, గొళ్ల తేజలకు కలిచేట సతీష్ కుమార్ జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో వేమారెడ్డి వినీత్ రెడ్డి, శ్రీవెంటేశ్వర డిగ్రీ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కృష్ణ, జిల్లా కబడ్డీ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కుమార్, నిర్వాహకులు సన్నీ.నాని, గిరి, ఎ.సింహాద్రి, అంపైర్లుగా అమర్‌రాజ్, విజయకుమార్ వ్యవహరించారు.

ఉచితంగా వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని ధర్మవరం గ్రామంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఉదయగిరి నియోజకవర్గం టిడిపి నాయకులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంజీవని ఆరోగ్య రథం ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందుల పంపిణీ కూడా చేశారు. ఈ వైద్య శిబిరంలో 110 మంది గ్రామస్తులు వివిధ అనారోగ్య సమస్యలతో వైద్యులను సంప్రదించారు. వారిలో 78 మందికి కంటిచూపు సమస్యలకు చికిత్స చేశారు. వారందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంధిరెడ్డి మాలకొండయ్య, కాలే శ్రీను, ముజే మాలకొండయ్య, ముజే నర్సింలు, మాలకొండయ్య, ఒంటేరు నాగేశ్వరరావు, సిహెచ్ తిరుపతయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

ప్రజాశక్తి-కావలి : విక్రమ సింహపురి యూనివర్సిటీ నెల్లూరు సోమవారం స్పోర్ట్స్ మెరిట్ సర్టిఫికెట్స్ అండ్ స్పోర్ట్స్ మెరిట్స్ స్కాలర్షిప్ నిర్వహించారు. విక్రమసింహపురి యూనివర్సిటీ కావలి కళాశాల విద్యార్థులకు ఐదు మందికి రూ.3వేల నగదు బహుమతి, ఉమెన్స్ ఇన్‌స్టిట్యూషనల్ చాంపియన్షిప్ రూ.25వేల నగదు బహుమతిని ప్రొఫెసర్ జిఎం సుందరవల్లి, వైస్ ఛాన్స్‌లర్ విక్రమ సింహపురి యూనివర్సిటీ నెల్లూరు రిజిస్టర్ ప్రొఫెసర్ రామచంద్రారెడ్డి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ సునీత అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ చేవూరు మణికంఠ, విద్యార్థులు పాల్గొన్నారు.

చెకుముఖి పత్రికను ప్రోత్సహించాలి : జెవివి

ప్రజాశక్తి-కావలి



సైన్స్ పరంగా ప్రజలను అభివృద్ధి పరచుకునేందుకు, విజ్ఞానాన్ని పెంచుకునేందుకు జె.వి.వి. ఆధ్వర్యంలో వెలువడుతున్న "చెకుముఖి" సైన్స్ మాసపత్రికలను ప్రతిఒక్కరితో చదివించి ప్రోత్సహించాలని జె.వి.వి. కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని జె.వి.వి.బాధ్యులు పిలుపు నిచ్చారు. పట్టణంలోని రవి నర్సింగ్ హోమ్‌లో కావలి పట్టణ జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల ఫిబ్రవరిలో కావలి పట్టణంలోని రెడ్‌క్రాస్‌లో కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని జరిగిన సైన్స్ వారోత్సవాలు కావలి పట్టణ, పరిసర ప్రాంతాల విద్యార్థులలో 'సైంటిఫిక్ టెంపర్'ను పెంపొందించినట్లు తెలియజేశారు. విద్యార్థుల్లో ఈ సైంటిఫిక్ టెంపర్‌ను నిరంతరం కొనసాగింపు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రతి ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెకుముఖి మాస పత్రికలు అందించడానికి క్యాంపైన్ నిర్వహించి, ఆయా స్కూళ్లకు క్రమం తప్పకుండా ప్రతినెలా చెకుముఖి మాసపత్రిక వచ్చేటట్లు చూడాలని తెలిపారు. స్థానికంగా స్కూల్‌లో పనిచేస్తున్న సైన్సు ఉపాధ్యాయులతో జె.వి.వి. కార్యవర్గ సభ్యులు కలిసి విద్యార్థులను చెకుముకి పత్రికలు చదివేటట్లు ప్రోత్సహించాలన్నారు. తద్వారా విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్‌ను పెంపొందించి కొనసాగించాలని తెలియజేశారు. 'నేటి విద్యార్థులే రేపటి పౌరులు' కనుక వీరి ద్వారానే సమాజంలోని మూఢనమ్మకాలకు చెక్ పెట్టాలని తెలియజేశారు. పట్టణ జెవివి కోశాధికారి టి.సుబ్బరామశర్మ, ఉపాధ్యక్షులు పాపిశెట్టి. జానకిరామ్, కందికట్టు.నారాయణ, సంయుక్త కార్యదర్శి షేక్. ఖాదర్ భాషా, ఇ.సి. సభ్యులు జి.కళ్యాణి, వి.మల్లికార్జునరావు, ఆళ్ల.కోటేశ్వరరావు, సభ్యులు గాదిరెడ్డి.మురళీకృష్ణ, సి. హెచ్. హెచ్.వి. రాజశేఖర్, జాన్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు మృతికి కాకర్ల సంతాపం

ప్రజాశక్తి-ఉదయగిరి : సీనియర్ జర్నలిస్టు మల్లికార్జున మృతికి టిడిపి నాయకులు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ సంతాపం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గత 30 సంవత్సరాలుగా జర్నలిజం వృత్తిలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్న పెనుబర్తి మల్లికార్జున ఇకలేరు అన్న వార్త తనను ఎంతగానో కలిచివేస్తుందని భావోద్వేదానికి గురయ్యారు. జర్నలిజం వృత్తిలో ఎన్నో నిజాలను నిర్భయంగా వార్తలు రూపంలో ప్రజలకు చేరవేయటంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని ఆయన చేసిన సేవలు మరువలేమని గుర్తుచేశారు. దుత్తలూరులోని మల్లికార్జున ఇంటి వద్ద మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి అనంతరం మల్లికార్జున అనారోగ్యంతో బాధపడుతున్న తరుణంలో వారికి అండగా కాకర్ల ట్రస్టు అధినేత కాకర్ల సురేష్ నిలిచానని ఇకపై కూడా ఏ సమస్య వచ్చినా తానున్నానని భరోసాను వారి కుటుంబానికి కల్పించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రూ.10వేల ఆర్థికసాయం

ప్రజాశక్తి-ఉదయగిరి


ఆర్థికసాయం చేస్తున్న దృశ్యం

టీబీ వ్యాధి గ్రస్తులకు పౌష్టిక ఆహారం అందించేందుకు కాకర్ల ట్రస్ట్ అధినేత నియోజకవర్గం టిడిపి నాయకులు కాకర్ల సురేష్ తక్షణమే రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. సోమవారం మండల పరిధిలోని గండిపాలెం పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న టీబీ వ్యాధిగ్రస్తులకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ నెలకు సరిపడా పౌష్టిక ఆహారాన్ని డాక్టర్ శివకల్పనా రెడ్డితో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధే ధ్యేయంగా జాతీయ అధ్యక్షులు సూచనలతో ముందుకు నడుస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతూ అందులో భాగంగా అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు భరోసా అండగా కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ నిలుస్తుందని తెలిపారు. అనంతరం సున్నవారు చింతల గ్రామంలో పిడుగుపాటుకు గురై మరణించిన లక్ష్మికుమారి కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులు చల్లకోలుసు కొండలరావుకు రూ.10 వేల తక్షణ ఆర్థికసాయం అందించి వారిలో మనోధైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మల్లిరెడ్డి రాజశేఖర్, టి.వెంగళరావు, సిచ్.కొండలరావు, పి.వి.సుధాకర్, ఉప్పుటూరి వినోద్, పత్తి ప్రసాద్, పత్తి తిరుపతయ్య, చల్లకొలుసు మల్లికార్జున, గ్రామస్తులు పాల్గొన్నారు.

కావలి ప్రతిష్టను పెంచిన రెడ్‌క్రాస్ సేవలు

ప్రజాశక్తి-కావలి : కావలి రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు రాష్ట్ర, జాతీయ స్థాయి గుర్తింపు పొంది, అనేక అవార్డులు పొందడం ద్వారా కావలి ప్రతిష్టను పెంచాయని ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రెడ్‌క్రాస్ భవనంలో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాలను ఎంఎల్ఎ ప్రారంభించారు. డాక్టర్ లక్ష్మీనరసారెడ్డి, కనమర్లపూడి కోటేశ్వరరావు, మాగుంట పార్వతమ్మల సహకారంతో ప్రారంభించిన రక్తకేంద్రం రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో ఉందని పేర్కొన్నారు. రక్తకేంద్రం ఆధునికీకరణకు తనవంతు ఆర్థిక సహకారం అందించానని, ఇకపై కూడా కావలి రెడ్‌క్రాస్‌కు తన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఉద్యమ స్థాపకులు సర్‌హెనరీ డ్యూనంట్ చిత్రపటానికి పూలమాల వేసి, జన్మదిన కేక్ కట్ చేశారు. కార్యక్రమాలలో ఆర్‌డిఒ శీనానాయక్, రెడ్‌క్రాస్ బాధ్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్, రవిప్రకాష్, సుధీర్ నాయుడు, ప్రసన్నాంజనేయులు, కలికి శ్రీహరిరెడ్డి, పార్వతిశంకర్, మాకినేని అరుణ, జమున, మధురంతకం నళిని, షమారహీం, సాయితేజ, మధుసూర్య, హనుమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : ఆర్ఎస్ఆర్ ఇంటర్ నేషనల్ స్కూల్‌లో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవ సందర్భంగా బోగోలు మండల రెడ్‌క్రాస్ బ్రాంచి చైర్మన్ డాక్టర్ కట్టిపల్లి సింహాద్రిరావు అధ్యక్షతన సోమవారం ఎన్‌సిసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బోగోలు రెడ్‌క్రాస్ కార్యదర్శి ఎస్ ఇ ఆర్ వి కన్వీనర్ బి లక్ష్మినంద, ఫస్ట్ ఎయిడ్ సి పి ఆర్ పై ఎన్ సి సి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎన్ సి సి క్యాంప్ కమాండెంట్ సునీల్ కుమార్, ఎన్‌సిసి విద్యార్థులు, పాఠశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.